సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



గుక్కెడు నీరు ఇవ్వలేరా..? 8లో



పర్యావరణహిత సాంకేతికతతోనే సుస్థిర భవిష్యత్ 8లో



శ్రీ విద్యా గణపతిగా సంపత్ వినాయగర్ 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి కనకమహాలక్ష్మి పవిత్రోత్సవాలు



పవిత్రాలు సిద్ధం చేస్తున్న ఈవో శ్రీనివాసుల రెడ్డి, వేదపండితులు, ఆలయ అర్చకులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన పవిత్రాలు సిద్ధం చేసినట్లు వివరించారు. వార్షిక ఉత్సవాల్లో వైదికపరంగా ఎలాంటి దోషాలు, పొరపాట్లు జరిగినా వాటిని నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజున సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. అనంతరం పవిత్రోత్సవాలు ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాలు సందర్భంగా ఈ నెల 15న ఉదయం 11.30 నుంచి 12.30 గంటలకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పంచామృతాభిషేకాలు ఉండవు. 16న ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, దర్శనాలు నిలిపివేస్తారు. 16న మధ్యాహ్నం పంచామృతాభిషేకం, 12.30 గంటల నుంచి గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేస్తున్నట్లు ఈవో వెల్లడించారు.

'అరకు' పర్యాటకుల కోసం అదనపు కోచ్‌లు



విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: అరకు అందాలను వీక్షించే పర్యాటకుల కోసం కిరండూల్ రైళ్లకు వారాంతపు రోజుల్లో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 14, 21, 28వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 15, 22, 29వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

- ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 16, 23, 30వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

ఆస్పత్రులు, క్లినిక్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మహారాణిపేట: విశాఖ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రులు, క్లినిక్‌లు, డెంటల్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు అన్నారు. రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2002 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు https://clinicalesttact.ap.gov.in/లో, స్కానింగ్ కేంద్రాలు https://pcpndt.ap.gov.in/ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఏచూరి మృతికి గొల్ల బాబూరావు సంతాపం

విశాఖ సిటీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి పట్ల రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు సంతాపం తెలిపారు. సీతారాం ఏచూరి ప్రజాపోరాట యోధుడని పేర్కొన్నారు. బలహీనవర్గాల గొంతుకగా ఆయన ప్రజా సమస్యలను రాజ్యసభలో లేవనెత్తి ప్రజా నేతగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఆయన మరణం తీరని లోటని, సీతారాం కుటుంబానికి సంతాపం తెలిపారు.

శ్రీకాకుళం రోడ్-తిరుపతి మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: తిరుపతి-శ్రీకాకుళం రోడ్-తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తిరుపతి-శ్రీకాకుళం రోడ్(07442) వీక్లీ స్పెషల్ రైలు ప్రతీ ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుంది. ఈ స్పెషల్ అక్టోబర్ ఆరు నుంచి నవంబర్ 10వ తేదీ వరకు నడుస్తుంది. శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07443) వీక్లీ స్పెషల్ రైలు ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరుతుంది. ఈ స్పెషల్ అక్టోబర్ 7 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు నడుస్తుంది.

మెడికలను చెరిపేసే కుట్ర



జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల నెలకొల్పి వైద్య విద్యను సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి గండి కొట్టారు.. అందనంత దూరంలో ఉండే మెడికల్ కాలేజీ తమ చెంతకే వస్తుందని సంబరపడ్డ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు.. అనుబంధంగా నెలకొల్పే బోధనాస్పత్రి ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని ఆశించిన రోగులకు నిరాశ మిగిల్చారు.. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఒకే ఒక్క కారణానికి వైద్య విద్యను మిథ్యగా మార్చారు.

- విద్యార్థుల ఆశలపై 'కూటమి' నీళ్లు
- నర్సీపట్నం మెడికల్ కళాశాలపై ప్రైవేటు'
- పీపీపీ విధానంలో కాలేజీ నిర్వహణ చేపట్టే యోచన
- పాడేరు మెడికల్ కాలేజీ సీట్ల సంఖ్య 150 నుంచి 50కి తగ్గింపు
- కూటమి ప్రభుత్వంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మండిపాటు

సాక్షి, అనకాపల్లి: వందేళ్ల తర్వాత వచ్చిన మహదవకాశమది.. అవకాశవాద రాజకీయాలకు చేజారిపోయింది.. నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే.. దానికి ఎగనామం పెట్టే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. పాడేరు మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్యను 150 నుంచి 50కి కుదించి విద్యార్థులకు తీరని అన్యాయం చేసింది. రానున్న 2025-26 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని నిర్ణయించిన ఏడు మెడికల్ కళాశాలల్లో ఒక పిడుగురాళ్ల మినహా మిగిలిన ఆరు(పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు) వైద్య కళాశాలల్లో ప్రభుత్వ పరంగా ప్రవేశాలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు అనుగుణంగా పీపీపీ విధానంలో నిర్వహణకు ప్రముఖ సంస్థలు ముందు కొస్తే వాటికి కళాశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని చూస్తోంది. ఇదే జరిగితే నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేట్ వైద్య కళాశాలగా మారడం ఖాయం. అప్పుడు భారీగా ఫీజులు చెల్లిస్తే కానీ సీటు దొరికే పరిస్థితి ఉండదు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1923లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో పాడేరులో కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.15 ఎకరాల్లో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి.. గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని సంకల్పించింది. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజనులకు సైతం అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు(నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి ఉంటారు.



విద్యార్థులకు అశనిపాతం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తక్కువ ఖర్చుతో మెడిసిన్ పూర్తి చేయాలని పేదింటి విద్యార్థులు పెట్టుకున్న గంపెడు ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్ల చల్లింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు కోసం కొందరు ఏడాదిపాటు, మరికొందరు రెండేళ్ల మూడేళ్ల పాటు కోచింగ్ తీసుకుని నీట్ పరీక్షలు రాసి సీటు సంపాదించుకుంటే.. ఇప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు తగ్గించి వారి ఆశలను అడియాసలు చేసింది. కొత్త కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి.. ఇప్పుడు మాట తప్పడంపై విద్యార్థులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కూటమి ప్రభుత్వ విధానాలపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం విరుచుకుపడుతున్నారు.



మెడికల్ కళాశాల ఊహా చిత్రం

టీడీపీ అడ్డుపుల్ల

అనకాపల్లి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయకుండా కూటమి పార్టీలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించాయి. తొలి విడతలో అనకాపల్లి టౌన్‌లో ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం కేటాయిస్తే.. స్థానిక టీడీపీ నేతలు న్యాయస్థానాల ద్వారా అడ్డుకున్నారు. దీంతో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలోని భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం ప్రారంభించింది. 2025 నాటికి ప్రారంభించాలనే గట్టి సంకల్పంతో గత ప్రభుత్వం 50 శాతానికి పైగా పనులు పూర్తి చేసింది. ఇందులో బోధనాస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలు, నర్సింగ్ కాలేజ్, వసతి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంది. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లకు తగ్గట్లుగా సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. కానీ ప్రభుత్వం మారగానే కూటమి ప్రభుత్వం పేదల కళాశాలను ప్రైవేట్‌పరం చేసేందుకు యత్నిస్తోంది.

ప్రైవేట్‌పరం చేయవద్దు



పేద ప్రజలకు మెరుగైన వైద్యం, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో విద్య, అదనపు ఎంబీబీఎస్ సీట్ల లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 కొత్త మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఈ కళాశాలల నిర్మాణం పూర్తయితే అదనంగా 1,800 సీట్లు దక్కుతాయి. ఇప్పటికే ఐదు కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మొత్తం మారిపోయింది. ఎవరి మీద ద్వేషంతోనో మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వం ప్రతిపాదించి.. నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి వీలులేదు. అందరూ కలసి దీనిపై ఉద్యమించాలి.

– పిల్లా మిత్ర మేఘన, రేవళ్లపాలెం, మధురవాడ

ప్రభుత్వ యోచన సరికాదు



మాకవరపాలెం వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి. దీన్ని ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వం యోచించడం సమంజసం కాదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఫీజులు తక్కువగా ఉంటాయి. సామాన్యులు సైతం వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం కలగనుంది. పైగా సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుబాటులోకి వస్తుంది. దీన్ని ప్రైవేటు పరం చేయాలని చూడటం వల్ల వైద్య విద్య సామాన్యులకు మిథ్యే కానుంది. ప్రైవేటీకరణ యత్నాలు విరమించుకోవాలి.

– వై.గణేష్, ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థి, కశింకోట

చాలా బాధాకరం



ఎంబీబీఎస్ చదవడం ఎంతో మంది కల. రాష్ట్రంలో అరకొరగా ఉన్న మెడికల్ సీట్లతో ఎంబీబీఎస్ చదువు ఉన్నత వర్గాలకే పరిమితమైంది. మధ్య తరగతి వారికి అందని ద్రాక్షగా మారింది. దీంతో చాలా మంది మధ్య తరగతి పిల్లలు వైద్య విద్య కోసం.. ఎన్నో ఇబ్బందుల మధ్య విదేశాలకు వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో సొంత రాష్ట్రంలో ఎంతో మందికి ఎంబీబీఎస్ చదివే అవకాశం వస్తుందని సంతోషపడ్డాం. దీనిని అడ్డుకుని ప్రైవేట్‌పరం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్లు వార్తలు వింటున్నాం. ఇది చాలా బాధాకరం.

– ఎ.ధనశ్రీ, ఆరిలోవ, వైద్య విద్యార్థిని

కౌన్ బనేగా వీసీ



- వీసీల నియామకానికి నోటిఫికేషన్
- ఏయూ వీసీ పోస్టు కోసం తీవ్ర పోటీ
- రేసులో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు
- మరో నలుగురు ప్రయత్నాలు
- సామాజిక, రాజకీయ బలం ఉన్న వారికే పదవి

విశాఖ సిటీ : ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సీటుకు రాజకీయ రంగు పులుముకుంటోంది. నిన్న మొన్నటి వరకు వైస్ చాన్సలర్ నియామకానికి అనుభవం, సమర్థత ప్రామాణికంగా ఉంటే.. ఇప్పుడు సామాజిక వర్గం, రాజకీయ అండదండలే ప్రధాన అర్హతలుగా మారిపోయాయి. తాజాగా యూనివర్సిటీల వీసీ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడింది. దీంతో ఆశావహులు ఒక్కసారిగా తెరపైకి వచ్చారు. కీలకమైన ఏయూ వీసీ పోస్టు కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావుతో పాటు మరో నలుగురు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నియామకంలో సామాజిక వర్గం అంశమే కీలక భూమిక పోషించే అవకాశం కనిపిస్తోంది.

తెరవెనుక పావులు

ఏయూ శతాబ్ది వేడుకలు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పోస్టు కోసం ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అయిదుగురు సీనియర్ ప్రొఫెసర్లు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు ఒక్కో ప్రజాప్రతినిధి ద్వారా తెరవెనుక పావులు కదుపుతున్నట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు వారి ప్రత్యర్థి వర్గాలకు ఆ పదవి దక్కకుండా అవసరమైన పథక రచనలో కూడా కొందరు నిమగ్నమై ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

ఇన్‌చార్జ్ వీసీకి కీలక నేత అండదండలు

పోటీలో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈసీఈ ప్రొఫెసర్‌గా, ఆ విభాగం హెడ్‌గా ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గానే కాకుండా రక్షణ రంగ సంస్థలో పనిచేసిన అనుభవం ఉంది. ఆయన ఇన్‌చార్జ్‌గా వీసీగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే ఉద్యోగుల సమయ పాలనపై దృష్టి పెట్టారు. ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ప్రతి సెక్షన్‌లో ఉద్యోగులు నిర్ణీత సమయానికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈయనకు టీడీపీతో ఉన్న సత్సంబంధాలు కలిసి వచ్చే అంశంగా కనిపిస్తున్నాయి. అలాగే బీసీ(వెలమ) కావడం కూడా ప్రస్తుత పోటీలో కీలకం కానుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈయన ఏయూ పాలక మండలి సభ్యుడిగా మూడేళ్ల పాటు పని చేశారు. తాజాగా అనకాపల్లి జిల్లాలో అదే సామాజిక వర్గానికి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వీసీ రేసులో శశిభూషణరావు పేరుతో ప్రముఖంగా వినిపిస్తోంది.

మద్దతు కూడగడుతున్న ఉమామహేశ్వరరావు

గతంలో రిజిస్ట్రార్‌గా చేసిన ఉమామహేశ్వరరావు కూడా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈయన మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం లయన్స్ కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అందరిని కలుపుకొని వెళతారన్న గుర్తింపు ఉంది. ఉమామహేశ్వరరావు ఓసీ (కమ్మ) కావడం ప్రధాన బలం. అయితే ఇప్పటికే రిజిస్ట్రార్‌గా అదే సామాజిక వర్గానికి చెందిన ధనుంజయరావును నియమించారు. మళ్లీ వీసీగా అదే వర్గానికి చెందిన ఉమామహేశ్వరరావుకు ఎలా ఇస్తారన్న ప్రశ్నను అతని ప్రత్యర్థి వర్గం వారు తెరపైకి తీసుకువస్తున్నారు. ఆయన మాత్రం సామాజికవర్గాలను కూడగట్టుకోవడంతో ఒక ఎంపీ మద్దతుతో ప్రయత్నాలు చేస్తున్నట్లు ఏయూలో చర్చ జరుగుతోంది.

వర్గాల వారీగా విడిపోయి

లక్షల మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆంధ్రా యూనివర్సిటీలో ఇటీవల కాలంలో కులాల కంపు కొడుతోంది. ఏ పదవి, ఉద్యోగం, తాత్కాలిక నియామకం.. ఇలా దేనికైనా అదే గీటురాయిగా మారిపోయింది. విద్యార్థి సంఘాలతో పాటు కొంత మంది ప్రొఫెసర్లు కూడా సామాజికవర్గాల వారీగా విడిపోయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీసీ పోస్టు కోసం పోటీ పడుతున్న వారిలో ఒక్కొక్కరి వెనుక ఒక్కో వర్గం పావులు కదుపుతున్నట్లు వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందులో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావుకు వ్యతిరేకంగా ఒక వర్గం పనిచేస్తున్నట్లు సమాచారం. ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి కొందరు శశిభూషణరావుకు వీసీ పోస్టు రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఏయూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వ పెద్దల ఆశీర్వాదాలు ఉన్న వారే వీసీగా బాధ్యతలు చేపడతారన్నది బహిరంగ రహస్యమే.

రేసులో మరికొందరు కూడా..

ప్రస్తుత రిజిస్ట్రార్ ధనుంజయరావు కూడా పోటీలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే ఒంగోలులో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వీసీగా వెళ్లిన డి.వి.ఆర్.మూర్తి(బ్రాహ్మిణ్), ప్రస్తుత ఏయూ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు(ఎస్సీ) కూడా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ, ఓసీలకు అవకాశం లేని పక్షంలో రాజు పేరును పరిశీలించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పోలీస్ కస్టడీ నుంచి నిందితుడి పరారీ



పరారైన నిందితుడు కృష్ణబాబు

పీఎం పాలెం: పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడు పరారైన ఘటన పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొండెయపాలేనికి చెందిన ఎర్నింటి కృష్ణబాబు అలియాస్ గంగడు(22) చిన్న వయసు నుంచి దొంగతనాలకు అలవాటుపడ్డాడు. అతని ఆగడాలు సహించలేక కుటుంబ సభ్యులు దూరంపెట్టారు. ఏకాకిగా ఉంటూ అవకాశం చిక్కినప్పుడల్లా దొంగతనాలు చేస్తూ విలాసాలు చేస్తుండేవాడు. నాలుగు కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడు. రెండు రోజుల క్రితం ఎండాడ కూడలి వద్ద స్థానిక క్రైం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. గతంలో 10 ఇళ్లల్లో జరిగిన దొంగతనాల్లో కృష్ణబాబు ప్రమేయంపై పీఎం పాలెం స్టేషన్‌లో క్రైమ్ సీఐ ప్రకాష్ విచారణ జరిపారు. విచారణ సమయంలో నిందితుడి వద్ద గంజాయి పొట్లాలను గుర్తించారు. గంజాయికి సంబంధించిన కేసుల్ని విచారిస్తున్న లా అండ్ ఆర్డర్ విభాగానికి బుధవారం ఉదయం 10 గంటలకు తరలించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కృష్ణబాబు తన చేతికి వేసిన బేడీలను విడిపించుకుని, అదను చూసి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. నిందితుడి పరారీకి దారి తీసిన పరిస్థితులపై ఇన్‌చార్జి ఏసీపీ పెంటారావు గురువారం విచారణ చేపట్టారు.

కమ్యూనిస్టు ఉద్యమ ధీరుడు ఏచూరి

- వామపక్ష నేతల నివాళి
- విశాఖతో విడదీయలేని అనుబంధం
- జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక ఇక్కడే...

గాజువాక /డాబాగార్డెన్స్: కమ్యూనిస్టు మేధావి, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విశాఖతో మర్చిపోలేని అనుబంధం ఉంది. కాకినాడ ప్రాంత వాసి అయిన ఆయన మద్రాసులో చదువు ప్రారంభించి ఢిల్లీలో స్థిరపడ్డారు. విద్యార్థి దశలో రాజకీయ ప్రస్థానం ప్రారంభమై అఖిల భారత స్థాయిలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన ఆ పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా విశాఖ నుంచే ఎన్నికయ్యారు. 2015 ఏప్రిల్ 14 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని పోర్టు స్టేడియంలో నిర్వహించిన సీపీఎం 21వ జాతీయ మహాసభల్లో ఆయన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, విశాఖతో ఆయన తొలి నుంచీ మంచి ఉద్యమ సంబంధాలను కలిగి ఉన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, పార్లమెంటరీ కమిటీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో షిప్‌యార్డ్‌ను రక్షణ రంగంలోను, బీహెచ్‌పీవీని బీహెచ్ఈఎల్‌లో విలీనం చేయడానికి తీవ్రంగా కృషి చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ముందుకు సాగేందుకు తగిన సూచనలు ఇవ్వడమే గాక, దేశ వ్యాప్తంగా స్టీల్ ఉద్యమానికి మద్దతు కూడగట్టారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయమై సీపీఎం గతేడాది అక్టోబర్ 5న ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేపట్టిన బైక్‌యాత్ర, అనంతరం స్టీల్‌ప్లాంట్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీతారాం ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ విధంగా విశాఖతోను, విశాఖలోని ప్రజా ఉద్యమాలు, కార్మిక పోరాటాలతోను విడదీయలేని బంధాన్ని ఏర్పరచుకున్నారు. ఆయన మృతి వార్త ఈ ప్రాంత ఉద్యమకారులను, వామపక్షవాదులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీతారాం మృతి తీరని లోటు

సీతారాం ఏచూరి మృతి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు తీరని లోటని సంతాప సభలో పలువురు వక్తలు కొనియాడారు. ఏచూరి మరణ వార్త తెలిసిన వెంటనే సీపీఎం విశాఖ జిల్లా కమిటీ గురువారం సాయంత్రం సీపీఎం జిల్లా కార్యాలయంలో సంతాప సభ నిర్వహించింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీనియర్ నాయకులు ఎ.అజశర్మ, ఎస్.సుధాకర్, కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, బి.జగన్‌లు సీతారాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, రాజు, నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు పీతల అప్పారావు, పి.వి.రమణ, జి.పోలేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



2023 అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

ఉక్కు ఉద్యమానికి భరోసా ఇచ్చారు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీతారాం ఏచూరి పోరాటం చేశారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ తెలిపారు. పోరాట కమిటీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమై ఉద్యమం గురించి దిశా నిర్దేశం చేశారన్నారు. ఆయన మృతికి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తరఫున నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు.

విశాఖను నంబర్ 1 స్థానంలో నిలబెడదాం

మహారాణిపేట: సమ్మిళిత అభివృద్ధి విధానాలు అవలంబించడంతో పాటు యువతకు ఉపాధి, ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ విశాఖ జిల్లాను దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలని ఎంపీ ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర పథకాల తీరుతెన్నులు, సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు, అధికారుల సమన్వయం తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో దిశ(డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా కృషి చేయాలన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృత అవగాహన కల్పించి.. వీలైనంత ఎక్కువ మంది కనెక్షన్లు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్నారు. గృహ సంబంధిత పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. మేహాద్రి గెడ్డ, గంభీరం రిజర్వాయర్లలో పూడికలు తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, పంచకర్ల రమేష్ బాబు పలు అంశాలపై సూచనలు చేశారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పథకాల అమల్లో అధికారులు చేస్తున్న కృషిని వివరించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, డీఆర్వో కె.మోహన్‌కుమార్, జెడ్పీ సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారిక సమావేశానికి హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

గండి బాబ్జీకి ఏం పని?

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జరిగిన అధికారిక సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ హాజరవ్వడం చర్చనీయాంశమైంది. విశాఖ ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ వరకు హాజరవడం సర్వసాధారణం. అయితే బాబ్జీ ప్రజాప్రతినిధి కాదు. మరి ఓ రాజకీయ నేత.. అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలతో కలిసి కూర్చోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు కూడా ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు సరికదా.. ఆ పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తడం గమనార్హం. దీంతో అధికారిక సమావేశం కాస్త.. పార్టీ కార్యక్రమంలా మారిందని పలువురు గుసగుసలాడారు. ఉనికి చాటుకునేందుకు ఇన్ని అగచాట్లు అవసరమా? అంటూ విమర్శించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సుమారు రూ.60,500 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జేకే మీనా వారి సిబ్బందితో కలిసి పలు ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కోరాపుట్‌కు చెందిన షాను ఖాడా, మంగరాజ్ ఖడాలు 12.1 కిలోల గంజాయిని రవాణా చేయడం గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని జీఆర్పీ ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. రిమాండ్ నిమిత్తం వారిని కోర్టులో హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

గుక్కెడు మంచినీరు ఇవ్వలేరా..?

- కూటమి ప్రభుత్వంపై 35వ వార్డు మహిళల ఆగ్రహం
- రోడ్డుపై బైఠాయించి.. నిరసన తెలిపిన బాధితులు

దాబాగార్డెన్స్: గుక్కెడు మంచినీటి కోసం జీవీఎంసీ 35వ వార్డు మహిళలు రోడ్డెక్కారు. 10 రోజులుగా కుళాయిలు సరిగ్గా రావడం లేదని అటు ప్రజా ప్రతినిధులు.. అటు జీవీఎంసీ అధికారులకు మొర పెట్టుకున్నా స్పందన కరువవ్వడంతో ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మహిళలను నచ్చజెప్పేందుకు వస్తే.. ఆయనపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓట్ల కోసం పది సార్లు మా దగ్గరకు వచ్చావు. ఇప్పుడు నీళ్ల కోసం రోడ్డెక్కే పరిస్థితి తీసుకొచ్చావు' అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వివరాలివీ..

జీవీఎంసీ 35వ వార్డు పెరికివీధి, వెలంపేట, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో నివసించే ప్రజలు 10 రోజులుగా మంచినీటి కష్టాలు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా వారు ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పి వదిలేశారు. వారం రోజులు గడిచినా సమస్య అలాగే ఉంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమికి సహకరిస్తూ ఓట్లు వేయించుకున్న స్థానిక స్వతంత్ర కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకు ఈ విషయం చెప్పారు. ఆయన నుంచి కూడా స్పందన లేకపోవడంతో గురువారం మహిళలంతా బిందెలతో రోడ్డెక్కారు. సమస్య తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు ఓ ట్యాంక్ పంపారు. ఒక్క ట్యాంకు ఇంత మందికి ఏం సరిపోతుందంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అటుగా వెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. మా ప్రాంతానికి కేవలం ఐదు నిమిషాలే నీటిని వదులుతున్నారని.. అదీ కూడా దుర్వాసనతో నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేకపోయినా ఓపిక పట్టామన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఓపిక నశించి.. రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు



రోడ్డులపై బిందెలు పెట్టి నిరసన తెలుపుతున్న జీవీఎంసీ 35వ వార్డు మహిళలు

కార్పొరేటర్‌ను నిలదీసిన స్థానికులు

ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆ ప్రాంతానికి వచ్చారు. వెంటనే స్థానిక మహిళలు ఒక్కసారిగా అతన్ని చుట్టుముట్టారు. నీళ్లు రాక మేము అనేక ఇబ్బందులు పడుతున్నా మీరు పట్టించుకోరా? ఎక్కడో ఉంటున్న మీకు మా బాధలు పట్టవు. మీరు ఇక్కడ ఉంటే మా బాధలు మీకు తెలుస్తాయి.. అంటూ నిలదీశారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని వారిని పక్కకు నెట్టారు. స్థానికంగా ఉన్న సీపీఎం నాయకులు కూడా మహిళలకు మద్దతుగా నిలిచారు. చివరకు కార్పొరేటర్ 24 గంటల్లోగా నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో పోలీసులు మహిళలను వెనక్కి పంపించారు.



కార్పొరేటర్‌కు విషయం చెబుతున్న స్థానికులు

బలవంతపు విరాళాలా?

- వరద బాధితులకు ఆర్థిక సాయం పేరుతో రేషన్ డీలర్లపై ఒత్తిడి
- కమీషన్‌లో 50 శాతం ఇవ్వాలని రాష్ట్ర డీలర్ల సంఘ నేత ప్రకటన
- ఎవరిని సంప్రదించకుండా ఎలా ప్రకటిస్తారని జిల్లా డీలర్ల మండిపాటు



మహారాణిపేట: రేషన్ డీలర్లకు మూడు నెలలుగా కమీషన్ అందలేదు. ప్రతి నెలా బియ్యం తప్పితే ఇతర నిత్యావసరాలు పంపిణీ జరగడం లేదు. దీంతో జిల్లాలో రేషన్ డీలర్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర డీలర్ల సంఘం ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం తీసుకున్న నిర్ణయం వివాదాన్ని రాజేసింది. అసలే ప్రభుత్వం నుంచి కమీషన్ డబ్బులు రాక ఇబ్బందులు పడుతుంటే.. వరద బాధితులకు విరాళం పేరుతో కమీషన్‌లో 50 శాతం ఇస్తామని రాష్ట్ర సంఘం ప్రకటించడంపై జిల్లా డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా కమీషన్ రాకపోయినా పట్టించుకోని రాష్ట్ర నాయకులు.. జిల్లాలో డీలర్లను సంప్రదించకుండా, వారి బాధలను పక్కనపెట్టి విరాళాలు ఇవ్వాలని ఒత్తిడి చేయడం పట్ల మండిపడుతున్నారు. విజయవాడను భారీ వరదలు ముంచెత్తడం బాధాకర విషయమని, బాధితులకు సహాయం చేయాలని ఉన్నా.. ప్రభుత్వం కమీషన్ ఇవ్వకపోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్ర, జిల్లా డీలర్ల మధ్య రగడ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రేషన్ డీలర్లకు బియ్యం తప్ప అదనపు సరకులు లేవు. పైగా మూడు నెలలుగా కమీషన్ బకాయి ఉంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో కొందరి పెద్దల మెప్పు కోసం రాష్ట్ర డీలర్ల సంఘం నేత ఒకరు దూకుడు ప్రదర్శించారు. ఏవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా డీలర్లకు వచ్చే కమీషన్‌లో 50 శాతం వరద బాధితులకు ఇవ్వాలని ప్రకటించాడు. దీంతో వివాదం రాజుకుంది. ఇది చిలికి చిలికి గాలి వానగా మారింది. ఆ నేత ప్రకటనను జిల్లా డీలర్లు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆ నేత తనకు ఉన్న సంబంధాలతో ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ విషయం తెచ్చి మీ సంగతి తేలుస్తానని బెదిరిస్తున్నట్టు తెలుస్తోంది.

డీలర్లకు ప్రభుత్వం షాక్

రేషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ మీద షాక్ ఇస్తోంది. ఎన్నికల ముందు ఎన్నో హామీలను గుప్పించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే డీలర్లకు చుక్కలు చూపించింది. గత ప్రభుత్వ హయంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా కమీషన్ వచ్చేది. కానీ మూడు నెలల నుంచి బియ్యం తప్ప ఎలాంటి పీడీఎస్ సరకులు కేటాయింపులు లేవు. ఏ సరకులు లేకపోయినా కనీసం పంచదార ఇస్తే తమకు కమిషన్ వచ్చేదని డీలర్లు చెబుతున్నారు. జిల్లాలో 625 మంది డీలర్ల పరిధిలో 5,12,619 మంది రైస్ కార్డులు ఉన్నాయి. సెప్టెంబర్‌లో కార్డుదారులకు అరకొర పంచదార ఇచ్చారు. దీంతో కమీషన్ పెద్దగా రాలేదు. అప్పటి నుంచి అగ్గిమీద గుగ్గిలం అవుతున్న డీలర్లకు ఆ సంఘ రాష్ట్ర నేత ప్రకటన తలనొప్పిగా మారింది. ప్రభుత్వం కమిషన్ విడుదల చేయడం లేదని, ఎలా 50 శాతం విరాళాలు ఇవ్వగలమని ఇప్పుడు డీలర్లు ప్రశ్నిస్తున్నారు. మూడు నెలలుగా ఎన్నో ఇబ్బందులు పడి షాపులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల సాయం



విశ్రాంత ఉపాధ్యాయుడు కామేశ్వరరావు

భీమునిపట్నం: రాష్ట్రంలో వరద బాధితులకు విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.వి.ఎల్.కామేశ్వరావు గురువారం రూ.రెండు లక్షల సాయం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి తన వంతు విరాళంగా ఈ మొత్తం అందించారు. కోవిడ్ సమయంలో కూడా ఆయన రూ.లక్ష సాయం చేశారు.

ఎన్ఆర్ఐల స్థలంపై రౌడీయిజం!

- కోర్టు ఆర్డర్ ఉన్నా స్థలం తమదంటూ రౌడీషీటర్ దౌర్జన్యం
- గోడలు కూల్చి.. బెదిరింపులు
- సీపీని ఆశ్రయించిన బాధిత ఎన్ఆర్ఐ దంపతులు

పెందుర్తి : తమ కష్టార్జితంతో కొనుక్కున్న స్థలాన్ని ఓ రౌడీ షీటర్ ఆక్రమించుకున్నాడని ఎన్ఆర్ఐ దంపతులు చిరికి నాయుడు, నారి వెంకటపద్మజలు గురువారం విశాఖ నగర పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. కోర్టు తీర్పు ప్రకారం తమ స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని 25 మంది వచ్చి దౌర్జన్యంగా పడగొట్టారని.. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. బాధిత ఎన్ఆర్ఐల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని నగర కమిషనర్ పెందుర్తి పోలీసులకు ఆదేశాలిచ్చారు. ఆ మేరకు ఎన్ఆర్ఐల మీద దౌర్జన్యం చేసిన దుల్ల వెంకట మహేష్, శ్రీనివాస్(మహేష్ సోదరుడు), జనసేన నేత డుంబారి ప్రభాకర్(రౌడీషీటర్)తోపాటు మరో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అసిరి తాత తెలిపారు. మురళీనగర్‌కు చెందిన చిరికి నాయుడు, చిరికి నారి వెంకట పద్మజ(స్థల యజమాని) దంపతులు సింహపురికాలనీ సమీపంలోని వుడా లేఅవుట్‌లో 2004లో రెండు స్థలాలు కొన్నారు. వాటిలో నిర్మాణాలు చేపట్టే ఉద్దేశంతో 2014లో ఇక్కడికొచ్చారు. అయితే అదే సమయంలో ఆ స్థలం తమదంటూ మురళీనగర్‌కు చెందిన దుల్ల వెంకటమహేష్, అతని అనుచరుడు డుంబారి ప్రభాకర్‌లు వీరిని అడ్డుకున్నారు. దీంతో అదే సంవత్సరం చిరికి నారి వెంకట పద్మజ కోర్టును ఆశ్రయించారు. దాదాపు పదేళ్ల పాటు విచారణ అనంతరం 2024 జూలై 11న పద్మజకు అనుకూలంగా దుల్ల వెంకట మహేష్‌పై కోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఇస్తూ తీర్పునిచ్చింది. దీంతో అమెరికాలో నివాసం ఉంటున్న నాయుడు, పద్మజ దంపతులు ఇటీవల ఇక్కడకు వచ్చి కోర్టు తీర్పు ప్రకారం తమ స్థలంలో గోడ నిర్మాణం చేసుకున్నారు. అయితే గురువారం ఉదయం దుల్ల మహేష్ అనుచరులు దాదాపు 25 మంది వరకు అక్కడకు వచ్చి ఆ గోడను పడగొట్టి, తమపై దాడికి ప్రయత్నం చేసినట్టు పద్మజ దంపతులు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం సీపీ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధిత ఎన్ఆర్ఐ దంపతులు పద్మజ, నాయుడు



చిరికి పద్మజకు చెందిన స్థలంలోని నిర్మాణాన్ని తొలగిస్తున్న డీవీ మహేష్ అనుచరులు

రోడ్డు ప్రమాదంలో సీఐకి గాయాలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో సంజయ్‌గాంధీ కాలనీ వద్ద గురువారం పోలీస్ జీపు, ప్రైవేట్ కారు ఢీకొన్న ఘటనలో సీఐకి కాలికి గాయమైంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం.. బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్య లైన్‌లో గ్రేహౌండ్స్ పోలీస్ జీపు అడవివరం నుంచి నగరానికి వస్తోంది. అదే లైన్‌లో కారు హనుమంతవాక నుంచి సింహాచలం వైపు వెళ్తోంది. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు సంజయ్‌గాంధీకాలనీ వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో జీపులో ఉన్న గ్రేహౌండ్స్ సీఐ జి.చంద్రశేఖరరావు కాలికి గాయమైంది. నిబంధనల ప్రకారం బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో పోలీసులు, వీవీఐపీల వాహనాలు మినహాయించి ప్రైవేట్ వాహనాలు ప్రయాణించకూడదు. అయినప్పటికీ, ఖాళీగా ఉన్న ఈ రోడ్లపై ప్రైవేట్ వాహనాలు అధికంగా ప్రయాణిస్తుండటం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీఆర్‌టీఎస్‌లో ఢీకొన్న పోలీస్ జీపు, కారు

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై రివ్యూకు సుప్రీం ఆమోదం

- గ్లోబల్‌మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య



మాట్లాడుతున్న బయ్యే మల్లయ్య

సీతంపేట: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై విశాఖపట్నానికి చెందిన డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ వేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆమోదించింది. ఈ నేపథ్యంలో తీర్పు వచ్చే వరకు వేచి చూడాలని గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశాఖలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని, న్యాయపరంగా అన్ని విషయాలు సమగ్రంగా పరిశీలించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోర్టుకు విన్నవించామని తెలిపారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు రద్దుచేసే వరకు పోరాటం చేస్తామని ఆయన వెల్లడించారు.

శ్రీ విద్యా గణపతిగా సంపత్ వినాయగర్



సీతమ్మధార : ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ స్వామి గురువారం శ్రీ విద్యా గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధికసంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సిరి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- బాధితులకు బ్యాగ్ అందజేత



బాధితులకు బ్యాగ్ అందిస్తున్న ఆటో డ్రైవర్ విజయ్ కుమార్

గోపాలపట్నం : ప్రయాణికులు ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను అందజేసి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతానికి చెందిన జి.రాజారావు కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు గురువారం ఉదయం విశాఖ వచ్చారు. సింహాచలం వెళ్లేందుకు ఎన్ఏడీ వద్ద ఆటో ఎక్కారు. అప్పన్న తొలిపావంచా వద్ద దిగారు. కొబ్బరికాయలు కొనుగోలు చేసే తొందరలో ఆటోలో బ్యాగ్ మరిచిపోయారు. ఇది గమనించని ఆటో డ్రైవర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత ఆటోలో బ్యాగ్‌ను చూసిన డ్రైవర్ ఐ.విజయ్‌కుమార్ పోలీసులకు సమాచారమందించాడు. గోపాలపట్నం క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసుల సమక్షంలో విజయ్‌కుమార్ బాధితులకు బ్యాగ్ అందజేశారు. బ్యాగ్‌లో రూ.10వేల నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయి.

19 నుంచి రాష్ట్ర స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు

గాజువాక : గణపతి మహోత్సవాల సందర్భంగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఓపెన్ పురుషులు, మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పి.కోటేశ్వరరావు తెలిపారు. విశాఖలోని సాలాపువానిపాలెంలో నిర్వహించనున్న ఈ పోటీలు 19న పురుషుల విభాగంలోను, 20, 21వ తేదీల్లో మహిళా విభాగంలోను నిర్వహిస్తామన్నారు. విజేతలకు పురుషులు, మహిళా విభాగాల్లో మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు, నాలుగవ బహుమతిగా రూ.10వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. వివరాలకు 7680005666, 9885698717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వ్యభిచారం గుట్టురట్టు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. మూడు నెలలుగా ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో గురువారం దాడి చేశారు. ఆ ఐదుగురు మహిళలు, ఇద్దరు విటులు, ముగ్గురు నిర్వాహకులను పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,150
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,050
వెండి(కిలో):	రూ.91,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

పర్యావరణహిత సాంకేతికతతోనే సుస్థిర భవిష్యత్

- ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు

ఎంవీపీకాలనీ: పర్యావరణహిత సాంకేతికతతోనే జీవరాశి సుస్థిర భవిష్యత్ సాధ్యమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఎంఎస్ఎంఈ సంస్థ, ఏయూ ఆ-హబ్ సంయుక్త ఆధ్వర్యంలో అల్గారిథమ్ ఆన్‌లైన్ సెంటర్ సెమినార్ హాలులో గురువారం ఎన్విరాన్‌మెంట్, ఎకనామిక్ అండ్ సోషల్ సస్టైనబిలిటీ(ఈఈఎస్ఎస్-2024) పేరిట అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయన్నారు. గాలి, నీరు, ఆహారం, స్మార్ట్ ఫోన్, సాంకేతికత ప్రస్తుతం మనిషి కనీస అవసరాలుగా మారాయన్నారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో పర్యావరణహిత సహజత్వాన్ని కోల్పోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ స్వరూప మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధిలో వాతావరణ సుస్థిరతను భాగం చేయడమే లక్ష్యంగా ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ స్కీమ్ ద్వారా ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధిలో వ్యవసాయం తరువాత ఎంఎస్ఎంఈ పాత్ర కీలకమన్నారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో కాలుష్య రహిత విధానాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూ వంటి ఉన్నత విద్యాసంస్థలు ప్లాస్టిక్ ఫ్రీ, కార్బన్ ఫ్రీ, గ్రీన్ ఎనర్జీ వంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనాలు చేయాలని సూచించారు. యూఎన్‌ఐడీవో నేషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ దాస్ (న్యూఢిల్లీ), యానిమల్ జెనిటిక్స్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యక్షుడు ఆల్ఫ్రెడ్ వాల్ (కెనడా), ఏయూ ఆ-హబ్ సీఈఓ రవిఈశ్వర్, ఎంఎస్ఎంఈ అసోసియేట్స్ ఎం.శరత్, జె.కోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం వీసీ.. సదస్సు వివరాలతో రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. శ్రీలంక, కెన్యా, స్వీడన్ దేశాలకు చెందిన ప్రతినిధులు, దేశంలోని వివిధ ఎంఎస్ఎంఈ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వీసీ ప్రారంభించారు.



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

రహదారులకు అంచనాలు రూపొందించాలి

విశాఖ సిటీ: సాధ్యమైనంత త్వరగా రహదారులకు అంచనాలు రూపొందించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన మాస్టర్‌ప్లాన్ రహదారులను పరిశీలించారు. నాతయ్యపాలెం నుంచి చుక్కవానిపాలెం వరకు ప్రతిపాదిత 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారిని, వీకేపీసీపీఐఆర్-యూడీఏ ప్రతిపాదిత జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీ నుంచి అచ్యుతాపురం 200 అడుగుల రహదారిని పరిశీలించారు. అలాగే అప్పన్నపాలెం జంక్షన్ నుంచి ఏపీ సెజ్ గేటు వరకు 100 అడుగుల రోడ్డును క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో పాటు అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఉన్న పరిశ్రమల సౌలభ్యం కోసం రద్దీ నియంత్రణలో భాగంగా విస్తరణ చేపట్టాల్సిన పలు రహదారులను కూడా పరిశీలించారు. అనంతరం అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధి పనుల విషయంలో ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి చర్చించారు. ఈ పర్యటనలో సీఈ భవానీ శంకర్, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీకేపీసీపీఐఆర్-యూడీఏ జాయింట్ డైరెక్టర్ శిల్పా, ప్లానింగ్ ఆఫీసర్ చైతన్య, డీఈ రవిశంకర్, ఆర్అండ్‌బీ డీఈ విద్యాసాగర్, ఏఈఈ ఆంజనేయ రాజు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాస్టర్‌ప్లాన్ రహదారులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

తీరం..అధ్వానం







బీచ్‌రోడ్డు: వినాయక నిమజ్జనం సందర్భంగా నగరవాసులు సాగరతీరాన్ని కలుషితం చేస్తున్నారు. పూజా సామగ్రిని ఎక్కడపడితే అక్కడే వేస్తుండడంతో ఆర్కే బీచ్ అధ్వానంగా మారింది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లను ఎవరూ ఉపయోగించడం లేదు. చిన్న చిన్న విగ్రహాలతో సహా..పూజ సామగ్రి కొట్టుకువస్తోంది. మరో వైపు తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను జీవీఎంసీ సిబ్బంది పొక్లెయిన్ సహాయంతో తొలగిస్తున్నారు.